# అన్వేషణ

రచన:
శ్రీమతి నిట్టల రామలక్ష్మి,

లోకాన్ని చీకటిజేసి అరుణభానుడు అదృశ్యుడయాడు!—అదే సమయాన;-ఆశలన్నీ నాశనం చేసి, హృదయేశ్వరుడు, తన నిష్కళంక, నిర్మల జీవితాన్నుంచి శాశ్వతంగా నిష్క్రమించాడు!—

శ్వేతపూతాకాశానికి అరుణకిరణుడు ఎంత శోభనిస్తాడో, పద్మముఖి ఫాలానికి 'కుంకుమ' అంత సొగసునిస్తుంది!

అస్తమించిన సూర్యుని కిరణాల వెనుకే, ఆమె ముఖాన్నుంచి కుంకుమ రేఖలు కూడా తొలగిపోయాయి!

బరువైన భావి జీవితపు భారాన్ని మోయవలసిన రోజులకు నాంది పలికి,-నవ్యసాహిత్య నేత? అశేషకీర్తిధాత! అయిన ఒక కవి, ఆ సాయంసమయంలో కీర్తిశేషుడయాడు!

* * *

అతనికి ఆడపిల్లలవైపు చూడటం అనే అలవాటసలు లేదు!-భయం కూడా...వంచిన తల ఎత్తని అతను చేసే కవిత్వాన్ని చదివిన ప్రతివారూ ఆశ్చర్యపోతారు!—అతన్ని అర్థం చేసుకోలేకపోతారు!

'ఆడది'—అంటేనే భయపడే అతడు ఏ సౌందర్యమూర్తి ఆదర్శంగా ఈ రచనలు సాగిస్తున్నాడా?—అనిపిస్తుంది! స్త్రీ సహజ సౌందర్య గుణగణాలను, సాదృశ్యంగావర్ణించే అతని మనఃప్రవృత్తి 'ఎలాటిదా?'-అని ఆలోచించి, విఫలులయినవారు కూడా లేకపోలేదు!

అతిగా మాట్లాడటం; అందరి కాలేజి స్టూడెంట్సులా తిరగడం అతని అలవాట్లలో లేవు! కాలేజి జీవితంలో అతడడుగుపెట్టిన నాటినించీ, నేటివరకూ చదువు విషయంలో అతన్ని కాదని ముందుకువెళ్ళినవారు లేరు!

అలవాడే కవితావాహిని దానంతట అవి కొట్టుకువచ్చింది! తొందరలోనే పెద్దల ప్రశంశలూ; అందరి ఆదరాభిమానాలూ అందుకోగలిగాడు! కీర్తికాముకుడైన ఆ బాలరచయిత తను, పెద్దలు ఆశీర్వదించి, 'అతనికి మంచి భవిష్యత్తు వుంది!'-అని పలికారు!

తల్లి లేనిలోటు ఏ వ్యక్తీ;-ఏ శక్తీ కూడా తీర్చలేవు! తానే ఘనకార్యం చేసినా, తల్లి సంతోషపడితేనే కొడుకుకు ఆనందం!... అతనికి తల్లి లేదు!—అయినా అజ్ఞాతంలోని ఆమె అతనికి సాయపడుతూంది!-ఆమె పవిత్ర స్మరణమాత్రం చేతనే ఏదో ఒక మంచి రచన చేయగలుగుతున్నాడు! ఆమే వుంటే:? అదే అతడూ అనుకుంటూంటాడు!...వెంటనే అతని రెండు కళ్ళనిండా నీరు నిలుస్తుంది!—జలజల జారుతుంది!

తల్లిదండ్రు లిరువురూ, 'నా' అన్నవారెవరూ లేని ఈ లోకంలో ఏకాకిగా వదలి పరలోకానికి పోయారు! పిత్రార్జితమైన కొద్దిపాటి ఆస్తీ, డబ్బుతో, స్వశక్తిమీద నిలబడి, B, A, లో అడుగుపెట్టాడు.

తీరిక సమయాల్లో వంటరిగా కూర్చుని ఆలోచించేటపుడు 'అమ్మ' జ్ఞాపకానికి

వస్తుంది! మనసు వికలమైపోతుంది! ఏదో ఆవేదన!... తెలియరాని బాధ!... ఆరాటం! తలెత్తి, తపనజెందుతాడు! చిన్నతనంలోనే ఆమెను కోల్పోయి, ఆమె ప్రేమకు దూరమయాడు! ఎవరివద్ద లభిస్తుంది తనకా సరితూగగల ప్రేమరసం!-ఆ ధ్యానంలో, ఆత్మశాంతికోసం కలం పుచ్చుకు కంకిరి బింకిరిగా వ్రాసినా, కవిత్వమయిపోయేది!-అది చదివిన అందరూ ఆనందించేవారు!-ప్రశంశించేవారు!-అందరికీ తను ఆనందం అందించగలిగి, అదే లోటైన జీవితాన్ని అతడు సాగిస్తున్నాడు!-అతనికి కావలసింది కీర్తికాదు!-ప్రశంశలు కాదు! రచనమూలంగా వచ్చే రాబడిగాదు! 'మాతృప్రేమ!'-అవే అతను ఆశపడే, ఆరాటపడే, అమోఘవస్తువు-అవి దొరుకుతుందా?_ ఏమో...అన్వేషణ సాగుతూంది!!

* * *

ఆమె కాలేజీ జీవితంలో అది మొదటి సంవత్సరం! మొదటి సంవత్సరపు తొలిరోజులలోనే అతని రచనలు ఆమె నాకర్షించాయి! ఆ రచనలో ఏదో ఒక మహాశక్తి సూదంటురాయిలా ఆమెను తన వైపుకు లాక్కుంది! అతని రచనలో ప్రాధాన్యత 'మాతృమూర్తి'వి! అందుకే ఆమె హృదయానికి హత్తుకుంది!___

అతనిని దగ్గరగా చూడాలని; మాట్లాడాలని, తహతహలాడింది!...ఎక్కడ జూచినా అతని రచనలే!-ఎవరినోట విన్నా అతనిని ప్రశంశించే వాక్యాలే!!

చివరికి ఓరోజు ధైర్యం చేసింది!-అతని రూముకు బయల్దేరింది!!

అసలే ఆడపిల్లలతో పరిచయం లేని; కోరుకోని అతనికి, సరాసరి ఆమె తన రూముకే రావటం చూసి కొంచెం ఖంగారు పడ్డాడు!

తలుపుతీస్తూనే తడబడుతూ, 'మీరు... మీరు...ఇలా...వచ్చారే...' అన్నాడు ఆమెకేసి భయంగా చూస్తూ!

ఆమె నవ్వి, 'ఏం?___రాకూడదాండి?' అంటూనే అతణ్ణి తప్పించుకుని లోపలికి వచ్చి, చుట్టూ కలయజూసింది!...టేబిల్ మీదకొన్ని పుస్తకాలు చిందరవందరగా పడివున్నాయి! అక్కడే వున్న గడియారం ఏ రాత్రివేళనో ఆగిపోయి విశ్రాంతి తీసుకుంటోంది! ప్రక్కనున్న మడతమంచం కిందా పైనా కూడా, అరటావు సైజు కాగితాలు చిందరవందరగా పడివున్నాయి! తెరిచివున్న పెన్ను సగం వ్రాసిన కాగితంమీద వుంది! గోడలకు ఏ సినిమాతారల కేలండర్లో వ్రేలాడి వుంటాయి అసలు విద్యార్థుల గదుల్లో!-కాని, ఒక్క స్త్రీమూర్తి పటం తప్ప మరేమీ గోడలకు లేవు!-

'కూర్చోండి!'-గదినంతటినీ కలయ జూడడంలో నిమగ్నమయిన ఆమెను విధిలేక కూర్చోమన్నాడు! చిన్నగా నవ్వుతూ చతికిలపడింది కుర్చీలో! 'మీరేదో వ్రాసుకుంటున్నట్లున్నారు! నే వచ్చి మీ రచన కంతరాయం కలిగించానేమో'-అంది కూర్చుంటూనే! నిజానికి ఆమెరాక విసుగు కలగకపోలేదు!-ఆమె అలా అంటుంటే ఏమంటాడు!-

'ఫరవాలేదు లెండి!' అని మాత్రం అని,

'మీరు కాలేజిలో చదువుతున్నారా?' అడిగాడు.

'అవునండి...మీా రెప్పుడూ చూడనే లేదా?'

'లేదండీ...మీా పేరడగవచ్చా!'

'నాపేరు లక్ష్మి! పి, యు. సి. చదువుతున్నా!'

సంభాషణ ఆగిపోయింది! యింకేవిటడగాలో తెలియక తలొంచుకుని, కాలితో నేల రాస్తూ నిలబడ్డాడతను!

ఆమె అతణ్ణే రెప్పవాల్చక చూడసాగింది!

రెండు నిముషాలు గడిచాయి!-

ఆ మౌనాన్ని భరించలేకపోయిందామె! అతన్ని చూస్తూ అంది! 'మీారు కథలు చాలా బాగా వ్రాస్తారండి! నేను కాలేజిలో చేరక పూర్వంకూడా మీాకథలు పత్రికలలో చదివేదాన్ని!-చాలా బాగుండేవి!'

'ఆ;...ఏదో లెండి!...ఇంతకీ మీా రెందుకు వచ్చారో అడగడం మర్చిపోయాను!' ఆమె త్వరగా వెళ్ళకపోతే, కాలేజికుర్రాళ్ళ కంటబడితే, మర్నాటికి యిద్దరిపేర్లు కూడా ఊళ్లో గోడలన్నింటిమీాదా ఎక్కుతాయి! అమెనన్యాయంగా నలుగురూ హేళన చేస్తారు!-కొంచెం భయపడ్డాడు!

ఆమె జవాబు చెప్పకుండానే అతన్నలాగే చూస్తోంది!

తలెత్తి అమెవైపు చూశాడు!—ఆమె వెనుకవున్న గోడను వేళ్ళాడుతున్న పటం

DEPENDABLE PLACE
*For* DELIGHTFUL
DRESS GOODS

BENARES,
BANGALORE,
BENGAL, etc.
**SAREES**

SILKS of EVERY STYLE HANDLOOM COTTON SAREES; DHOTIES and other Clothing materials.

ALL OF THE HIGHEST QUALITY

**S. R. B. Kuppuswamy Iyer & Son,**
(Formerly :—S. R. BALUSWAMY IYER & SONS)

**230, East Marret Street, Madurai.** Phone : 36
**117, Nyneappa Naick Street, P. T Madras.** Phone : 32206

మీదికి మళ్ళాయి అతని కళ్ళు!-అదే పోలికే! అదే నవ్వు!...

'మీ పేరేమిటన్నారూ?' అడిగాడు తిరిగి.

'లక్ష్మి!' తీగ మీటినట్లయింది!—

ఒక్కసారి కళ్ళు రెండూ మూసుకున్నాయి! తిరిగి ఏవో స్మృతులు రేగాయి!-అతని తల్లి పేరు కూడా 'లక్ష్మి'! తిరిగి ఆతడు కళ్ళు తెరిచేసరికి రెండుకళ్లూ చెమ్మగిలివున్నాయి! ఆమె ఆశ్చర్యపోయింది!-

'మీ కేదో జ్ఞాపకం వచ్చి, బాధ రేపినట్లుంది!-నేనొచ్చి మిమ్మల్ని అనవసరంగా బాధపెట్టాను!'-అంటూ లేచింది లక్ష్మి!

'మా అమ్మ జ్ఞాపకానికి వచ్చినపుడల్లా నా కళ్ళు చెమరుస్తాయి! అంతే! ఇంతకీ మీ రెందుకొచ్చారో.'

'అబ్బే! ఈ నోట్సు కాస్త దిద్దిపెడతారేమోనని వచ్చాను! దగ్గరగా యింకెవరూ లేక, మీ దగ్గిరికి వచ్చాను! వచ్చి మీ కలతకు కారణం అయాను!'

'అలా అనకండి! మీరేం చేసారు?-అదిగో ఆ ఫోటోవున్న మూర్తి నా కలతకు కారణం! సరే! దిద్ది రేపిస్తాను! కాలేజికి పోయేటపుడు వచ్చి తీసుకుపొండి!' అని ఆమె చేతనుంచి పుస్తకం తీసుకున్నాడు!-ఆమె వెళ్ళిపోయింది! ఉత్తుంగతరంగవాహినీ ప్రవాహంలా అంతులేని ఆవేదన కొట్టుకువచ్చింది!-ఆమె రూపు


# UNITED INDIA....

*A House of* :—STRENGTH - SECURITY - SERVICE.

*Transacts* :—FIRE - MARINE - MOTOR AND OTHER CLASSES OF MISCELLANEOUS ACCIDENT INSURANCE BUSINESS.

## THE UNIDTED INDIA FIRE & GENERAL INSURANCE CO., LTD.,

*Regd. Office* : "BOMBAY LIFE BUILDINGS"

**No. 9, Broadway, MADRAS-1.**

**Telegrams : "UNIGEN"** **Telephone : 21378, 21379.**

*Chairman* : M. CT. MUTHAIH.

*General Manager* : T. S. MUTHUSWAMI, M.A., B.L.

**Branches :—BOMBAY, NEW DELHI, PATNA, UJJAIN, CALCUTTA, MANGALORE, VIJAYAWADA, BANGALORE, COIMBATORE. HYDERABAD, ALLEPPEY, COCHIN, AHMEDABAD, VIRAMAGM and RAJKOT. MADURA, SURAT.**

**Overses Branches : COLOMBO, SINGAPORE, KOLALAMPUR, PENANG, HONGKONG and KAMPALA (East ofrica)**

*London Representatives* :

**Messrs. MUIR BEDDAL & Co., Limited,**

37, Grace Church Street,

LONDON, E. C.-3.

అతని మనోఫలకంపై శాశ్వతంగా నిలచి పోయింది!-తలుపువేసి గోడపైనున్న తల్లి పటంవైపు చూస్తూ అలానే నిలబడిపోయాడు!

* * *

'మీ పేరు శ్రీ కృష్ణకదూ?' అన్నా రాయన లోపలకు వస్తూనే!

'అవునండి!..రండి!' అనీ కుర్చీ చూపించాడు!

'అమ్మాయి చెప్పింది మీ గురించి; అదీ కాక, మీ కథలు నేనుకూడా చాలాసార్లు పత్రికలలో చూచాను! చాలా బాగా వ్రాస్తారు!'

'ఏదోలెండి; మీలాంటి ఆశీర్వచనా ఫలితమే అది! ప్రత్యక్షప్రశంసలు అతడికి కిట్టవు;

'మా అమ్మాయి లక్ష్మికి మీ కథలంటే మంచి యిష్టం! మీ ప్రతీరచనా చదువుతుంది దీక్షగా!'

ఆయన లక్ష్మితండ్రని అప్పుడు తెలిసింది!-

అయిదునిముషాలు గడిచాయి!-

ఆయన మెల్లిగా అన్నారు! 'మీతో ఒక విషయం మాట్లాడాలని వచ్చాను!' అని.

'చెప్పండి!' అన్నాడు!

'మా అమ్మాయిని మీకిచ్చి వివాహం చేయాలనే తలంపుతో, మిమ్మల్ని అడుగుదామని వచ్చాను!'

ఆయనలా అనడం విని ఆశ్చర్యపోయాడు శ్రీకృష్ణ!-ఆమెకు తను తగడేమో!-ఆమె చాలాఅందమైనది! ఏదో ఆలోచించసాగాడు!

అతని మౌనాన్ని చూచి ఆయన కొంచెం అనుమానపడి, 'నాయనా! కట్నం విషయం



నువ్వేమీ నన్నడగక్కరలేదు!-ఎంచేతంటావా, పెళ్ళి అవగానే నా ఆస్తి ఎలాగా అంతా నీవే! నాకా, అది తప్ప యింకెవరూ లేరు! తల్లి పోయిననాటినుంచీ, నేటివరకూ తల్లినీ తండ్రిని నేనై, దాని యిష్టాని కెన్నడూ అడ్డుచెప్పక ఎంతో గారవంగా పెంచాను! అటువంటప్పుడు నేను కోరేది దానిసుఖంతప్ప మరేం వుంటుంది చెప్పు?' అని అగారాయన, అతని జవాబు కోసం ఆతృతగా ఎదురు చూస్తూ?

శ్రీ కృష్ణ అన్నాడు?-'మీరు పొరబడ్డారు! కట్నం పుచ్చుకోవడమన్నది నా ఆశయాలకే విరుద్ధం! అదీగాక, కట్నం పుచ్చుకోవాలన్న బాధా నాకు లేదు! మా నాన్నగారేదో కొద్ది ఆస్తినిచ్చి వెళ్ళారు! నాకు చిన్ననాడే మాతృదేవత లోపించింది!-అదిగో! అదే ఆమె ఫొటో! మొన్న లక్ష్మిని చూశాను! ఆమెను చూడగానే ఎందుకో నాకు కొంత శాంతి లభించింది? అందుకే, ఆమెను చూస్తూ ఆయినా, అమ్మను మర్చిపోగలనేమో అనుకుంటున్నాను! - మీ అభ్యంతరా లేవీ లేకపోతే, లక్ష్మితో వివాహానికి నా అభ్యంతరం లేదు!'

ఆయన అంతులేని ఆనందంలో మున్గి తేలారు! వెంటనే ముహూర్తం పెట్టించారు!

పెళ్ళి వైభవోపేతంగా జరిగింది!

ఒక్కొక్కప్పుడు మానవ జీవితాలకి మధ్యలోనే వస్తుంది ఆపు? - కాలచక్రానికి ఆపులేదు! శ్రాంతిరాదు!

ఒక సంవత్సరం గడిచింది!-

పత్రికలలో 'శ్రీ కృష్ణ' కథలు పడటం లేదు! పఠితలు పత్రికలవారికి ఉత్తరాల వర్షం కురిపించారు! ఆయనిప్పుడు 'శ్రీ లక్ష్మి' అనే పేరుతో వ్రాస్తున్నారనీ, ఆ పేరుతో పడ్డవన్నీ ఆయవ కథలేనని వ్రాశాయి పత్రికలు.

భార్యపేరూ, తల్లిపేరూ 'లక్ష్మి' అవడం మూలాన ఆ పేరుతో కథలు పంపుతున్నాడు శ్రీ కృష్ణ!-తన కీర్తిని మాతృదేవతకు త్యాగం చేసాడు!

తల్లిని మరువగలననే ఆశతో లక్ష్మిని వివాహమాడాడు? కాని ఆమె జ్ఞాపకానికి వస్తూనే వుంది!-ఆ మాతృప్రేమ ఎలా లభ్యమవుతుందో అన్న అతని అన్వేషణకు ఆవలి పడ్డు కానరావడంలా!

స్వీయగాథను నవలా రూపంలోకి తెచ్చి

పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
Diamond 1898 1958 Jubilee
ఆయుర్వేదాశ్రమం (ప్రైవేట్) లిమిటెడ్,
మదరాసు-17.

Telegram : " LITHOGRAPH " Telephones : 58 & 75

**THE NATIONAL LITHO PRESS**

( ESTD. 1933)

RAILWAY FEEDER ROAD, Post Box No. 30 SIVAKASI, (S. I,)

దక్షిణ భారతంలో ఖ్యాతిగాంచిన ముద్రణాలయం!!

**ది నేషనల్ లితో ప్రెస్ - శివకాశి.**

నిపుణులైన పనివారలచే. మా ప్రెస్‌లో అందమైన విధంగా అగ్గి పెట్టె, బీడి, మిల్, సోప్, ఫైర్ వర్క్స్; బట్టలు; కాఫీ, టీ, మిఠాయి; సోడా మొదలయిన వాటికి కావలసిన లేబిల్సు; మరియు పెట్టెలు; లితోలోను; ఆఫ్‌సెట్‌లోను అచ్చువేసి ఇవ్వబడును. చిత్రాలుగల కాలెండర్లు "ఫోటో ప్రాసెస్" మూలంగాను ఆఫ్‌సెట్ పద్ధతిలోను తయారుచేసి ఇవ్వగలము.

ఆకర్షణీయమైన పలురంగులలో, పువ్వుల బార్డర్లలో పలు వివాహమహోత్సవాహ్వాన పత్రికలు రెడీమేడ్‌గా మా వద్దనున్నవి.

ముద్రణాలయములకు కావలసిన లితో, ఆఫ్‌సెట్ ఇంకులకు:—

**గిరిశెన్ ప్రింటింగ్ ఇంక్ ఫ్యాక్టరీ - శివకాశి,**

వారికి వ్రాయండి.

తల్లికి అంకిత మీయాలనే తలపు కలిగింది?- వెంటనే కాగితం కలం పుచ్చుకున్నాడు? తల్లి తండ్రుల మరణఘట్టం వరకూ బాగానే సాగింది రచన! ఆ ఘట్టాన్ని వర్ణించడానికి అతనిచేతులు వణికాయి!

ఏ మాతృప్రేమ కోసం తహతహలాడుతున్నాడో! ఏ తల్లి ప్రేమ లేనిలోటు తీరుతుందనీ; మనశ్శాంతి లభిస్తుందనీ ఆశపడి లక్ష్మిని వివాహమాడాడో!-ఏ తల్లి ప్రేమలోనిమాధుర్యాన్ని పొందగలననే ఆశతో అన్వేషణ సాగిస్తున్నాడో!-ఆ ప్రేమ తాను పొందలేక పోయాడు! తా నార్జించే కీర్తి ఎవరి ఆనందం కోసం?-మాతృప్రేమ లేని లోకంలో మనడం చాలా కష్టం? ఆ ప్రేమలోని అతీతఅనుబంధం విడువలేనిది! అతని నిత్య ఆ ఆలోచన మాతృదేవత గూర్చి! ఆలోచనలో బుర్రపాడయింది మనోవ్యాధితో మంచం పట్టాడు! వ్యాధి కుదుటపడలేదు! 'అమ్మా' అనే కలవరిస్తాడు! చిన్నపిల్లవాడిలా. యిదేం బెంగ అని అందరూ ఆశ్చర్యపోయారు! పెదిమి విరచాడు డాక్టరు! కుళ్ళికుళ్ళి ఏడ్చింది లక్ష్మి! అతణ్ణి బ్రతికించమని వెయ్యిదేముళ్ళకు మొక్కింది! దయాశూన్యుడయాడు భగవానుడు!-ఆమె ప్రార్థన ఆలకించలేదు!...

'అమ్మా!...అమ్మా!...అమ్మా!' అంటున్నాయి అతని పెదవులు!

ఇహలోకంలో తానుచేసిన ప్రయత్నాల వల్ల పొందలేకపోయిన మాతృప్రేమ, పరలోకంలోనైనా పొందవచ్చనే ఆశతో, ఈ లోకం విడిచి. పరలోకంలోని ఆమె సన్నిధికి పోయాడు!

అస్తమించే సూర్యునితో పాటు అస్తమించాడా కవి!

తేలిపోయిందొకరత్నం భువినుండి దివికి!